నమస్తే తెలంగాణ
ఖమ్మం
3 | ఖమ్మం, గురువారం 24 ఏప్రిల్ 2025 | KHAMMAM

వందేళ్లు గుర్తుండేలా పాతికేళ్ల పండుగ

- ఇప్పటికిప్పుడు ఎన్నికలొస్తే కాంగ్రెస్ కనుమరుగు ఖాయం
- రజతోత్సవానికి బీఆర్ఎస్ 'గూడెం' శ్రేణులు తరలాలి: వనమా



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

పాల్వంచ, ఏప్రిల్ 23:బీఆర్ఎస్ పాతికేళ్ల పండుగ మరో వందేళ్లపాటు గుర్తుండేలా జరగబోతోందని కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు కొత్తగూడెం నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. రజతోత్సవ సన్నాహక కార్యక్రమంలో భాగంగా పాత పాల్వంచలోని తన స్వగృహంలో బుధవారం ఏర్పాటుచేసిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోసపూరిత మాటలతో, 420 హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారం చేపట్టిన కాంగ్రెస్.. ప్రజలకు చేసిన మేలు శూన్యమని విమర్శించారు. హామీలు నెరవేర్చడంలో, పథకాలు అమలుచేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ పార్టీ కనుమరుగు కావడం ఖాయమని స్పష్టం చేశారు. అబద్ధాలతో అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు కిలారు నాగేశ్వరరావు, వనమా రాఘవేందర్‌రావు, కాంపెల్లి కనకేశ్, మడివి సరస్వతి, దాసరి నాగేశ్వరరావు, పూసల విశ్వనాథం, మల్లెల శ్రీరామ్మూర్తి, కొత్వాల సత్య, భూక్యా చందూనాయక్, వీరూనాయక్, తెలంగాణ సురేశ్, వీర్రాజు, చందు, అన్నం ప్రభాకర్, వీరన్న, కొండల్‌రావు, నరేశ్ పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు సిద్ధం కండి..

- మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పిలుపు

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి/సత్తుపల్లి టౌన్, ఏప్రిల్ 23 : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న పండుగలా జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పల్లె, పట్నం నుంచి తరలివచ్చేందుకు సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పిలుపునిచ్చారు. బుధవారం తల్లాడలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి నివాసంలో, పెనుబల్లిలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు అన్ని గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చేలా సన్నద్ధం చేయాలని సూచించారు. 25న ఎడ్లబండ్ల జరలో బీఆర్ఎస్ జెండా ఆవిష్కరణ ఉంటుందని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు. సత్తుపల్లి నియోజకవర్గం నుంచి భారీగా నాయకులు, కార్యకర్తలు బయల్దేరేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఆయా సమావేశాల్లో బీఆర్ఎస్ నాయకులు దుగ్గిదేవర వెంకట్‌లాల్, దొడ్డా శ్రీనివాసరావు, మురళి, జీవీఆర్, వజ్రాల రామిరెడ్డి, షేక్ హుస్సేన్, మండల పార్టీ అధ్యక్షుడు కనగాల వెంకట్రావు, మాజీ జడ్పీటీసీ చెక్కిలాల మోహన్‌రావు, మాజీ ఏఎంసీ చైర్మన్ చెక్కిలాల లక్ష్మణరావు, సీనియర్ నాయకులు కోటగిరి సుధాకర్‌బాబు, లక్కినేని వినీల్, మందడపు అశోక్‌కుమార్, టీవీ రామారావు, కొప్పుల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభను జయప్రదం చేయండి

- ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్

టేకులపల్లి, ఏప్రిల్ 23 : బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్ కోరారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27 జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశం దాస్‌తండాలో పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రజతోత్సవ సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సభకు ఊరూ.. వాడా తరలిరావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి అంతా కేసీఆర్ పదేళ్ల పాలనలో చేసిందేనని ఆమె గుర్తు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు బోడ బాలునాయక్, బానోత్ రామ, భూక్యా లాలు, బానోత్ మోహన్, నాగేందర్ పాల్గొన్నారు.

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

- కలెక్టరేట్, ఆర్డీవో, తహసీల్‌లలో సహాయక కేంద్రాలు
- భూభారతి, కొత్త ఆర్‌వోఆర్ చట్టంపై అవగాహన సదస్సులో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

మధిర, ఏప్రిల్ 23 : ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి, కొత్త ఆర్‌వోఆర్ చట్టంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ఆ దిశగా అధికార యంత్రాంగం కృషి చేస్తుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మధిర పట్టణంలోని రిక్రియేషన్ క్లబ్‌లో భూభారతి, కొత్త ఆర్‌వోఆర్ చట్టంపై బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న సమస్యలు, వివాదాలను తొలగించి పారదర్శకంగా ఉన్న భూ సమస్యలకు భూభారతి చట్టంతో పరిష్కారం లభిస్తుందన్నారు. భూముల సమాచారం, జీపీఎస్ ప్రక్రియతో మరోసారి సర్వే చేసి పూర్తి సరిహద్దులు నిర్ణయించి భూ యజమాన్యం నిర్ధారిస్తారని పేర్కొన్నారు. తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను కొనసాగిస్తున్నారని, ఇక నుంచి అన్ని పత్రాలు పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాతే రిజిస్ట్రేషన్ విధానం ముగుస్తుందన్నారు. భూభారతిలో ఎలాంటి లోపాలున్నా తమ దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. భూ సమస్యలపై చేసే దరఖాస్తుల్లోని తప్పులను నివారించడానికి కలెక్టరేట్‌లో సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే ఆర్డీవో, తహల్దార్ కార్యాలయాల్లో సహాయక కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో జీ.నరసింహారావు, అదనపు డీఆర్డీవో నూరుద్దీన్, మార్కెట్ చైర్మన్ బండారు నరసింహారావు, తహసీల్దార్ రాచబంటి రాంబాబు, ఏడీఏ విజయచంద్ర, మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్, ఏవో సాయిదీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ప్రాంగణంలో 'రజతోత్సవ' పోస్టర్ ఆవిష్కరణ

బీఆర్ఎస్ రజతోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

ఖమ్మం లీగల్, ఏప్రిల్ 23: ఈ నెల 27న వరంగల్‌లో జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పలువురు న్యాయవాదులు కోరారు. ఈ మేరకు సభ పోస్టర్‌ను ఖమ్మం లోని జిల్లా కోర్టు ప్రాంగణంలో బుధవారం ఆవిష్కరించారు. అడ్వకేట్ జేఏసీ చైర్మన్ బిచ్చాల తిరుమలరావు, బీఆర్ఎస్ లీగల్ సెల్ బాధ్యులు దిరిశాల కృష్ణారావు, కొత్త వెంకటేశ్వరరావు, మేకల సుగుణారావు, కొత్త రాంబాబు, రెంటాల ఆనంద్, వెంకట్, చరణ్, లాల్‌జాన్‌పాషా, మల్సూరు, రామ్మూర్తి, ముక్తేశ్వరరావు, లలిత, కన్నాంబ పాల్గొన్నారు.

రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే..

- గ్రామాల్లో పార్టీ జెండాలు ఎగురవేసి రజతోత్సవానికి బయలుదేరాలి
- కాంగ్రెస్ పాలనలో ఏం జరుగుతుందో మంత్రులకే అర్థం కావట్లేదు
- 16 నెలల్లోనే తెలంగాణను కాంగ్రెస్ సర్కారు అధోగతిపాలు చేసింది
- ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్

కారేపల్లి :సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్

కారేపల్లి, ఏప్రిల్ 23: రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని శాసనమండలి సభ్యుడు, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ స్పష్టం చేశారు. అబద్ధాలతో అధికారం చేపట్టిన కొద్ది రోజులకే ప్రజల్లో వ్యతిరేకతను మూటగట్టుకున్న పార్టీగా కాంగ్రెస్ ఖ్యాతి గడించిందని విమర్శించారు. ఎన్నికల హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని అన్నారు. రాబోయే మూడేళ్ల పాటు పార్టీ శ్రేణులు ప్రజల మధ్యనే ఉండాలని, కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఇదే సమయంలో ప్రజా సమస్యలపై పోరాడుతున్న బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ ప్రదర్శిస్తున్న దూకుడుకు భయపడేది లేదని తేల్చిచెప్పారు. సింగరేణి మండల కేంద్రంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రజానీకంతో కలిసి గాంధేయమార్గంలో స్వరాష్ట్రాన్ని సాధించిన ఉద్యమసారథి కేసీఆర్.. తరువాత ముఖ్యమంత్రిగా తెలంగాణను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దారని గుర్తుచేశారు. గడిచిన ఎన్నికల్లో ప్రజాతీర్పును గౌరవించి ప్రధాన ప్రతిపక్షంగా ప్రజాసమస్యలపై పోరాడుతున్నామని అన్నారు. అధికార పార్టీ ఎన్ని ఇబ్బందులు పెట్టినా ఎదుర్కొంటున్నామని అన్నారు.

ఢిల్లీకి డబ్బుల మూటలు..

అధికారం చేపట్టిన 16 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణను అధోగతిపాలు చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో ఏం జరుగుతోందో మంత్రులకు, అధికార పార్టీ ఎమ్మెల్యేలకే అర్థంకాక బోరున విలపిస్తున్నారని ఎద్దేవాచేశారు. కల్యాణలక్ష్మి, తులం బంగారం, ఉద్యోగులకు సకాలంలో వేతనాలు వంటివి కూడా ఇచ్చే పరిస్థితిలో ప్రభుత్వం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రజల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం.. ఢిల్లీకి డబ్బుల మూటలు పంపేందుకు హైడ్రా పేరుతో పేదల కడుపు కొడుతోందని మండిపడ్డారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్, బీఆర్ఎస్ ముఖ్య నేతలపై రేవంత్ సర్కారు అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేసే యోచనలో ఉందని అన్నారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలో కాంగ్రెస్‌ను గద్దె దింపేవరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

రజతోత్సవానికి తరలిరావాలి..

ఈ నెల 27న వరంగల్‌లో జరిగే రజతోత్సవానికి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని తాతా మధు పిలుపునిచ్చారు. పార్టీ పాతికేళ్ల ప్రస్థానం, భవిష్యత్ కార్యాచరణపై ఆ సభలో పార్టీ అధినేత కేసీఆర్ దిశానిర్దేశం చేస్తారని వివరించారు. సభకు బయలుదేరే ముందు అన్ని గ్రామాల్లోనూ గులాబీ జెండాలను ఎగరవేయాలని పిలుపునిచ్చారు. తొలుత కారేపల్లిలో తేళ్ల రవివర్మ వివాహ వేడుకకు హాజరైన తాతా మధు.. నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం ఇటీవల అనారోగ్యానికి గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వెంకిట్యా తండా బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు భాను భాస్కర్‌ను ఆయన ఇంటి వద్ద పరామర్శించారు. బీఆర్ఎస్ నాయకులు ముత్యాల సత్యనారాయణ, రావూరి శ్రీనివాసరావు, ధరావత్ మంగీలాల్, పుల్లారావు, పిల్లి వెంకటేశ్వర్లు, ముత్యాల వెంకట అప్పారావు, బత్తుల శ్రీనివాసరావు, రాందాస్‌నాయక్, జూపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

కదనరంగంలా కదిలిరావాలి

వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్

వైరాటౌన్, ఏప్రిల్ 23 : బీఆర్ఎస్ రజతోత్సవ సభకు కదనరంగంలా కదిలిరావాలని వైరా మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి బానోత్ మదన్‌లాల్ పిలుపునిచ్చారు. వైరాలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైరా నియోజకవర్గంలో ఈ నెల 27న ఉదయం పార్టీ జెండాలు ఎగురవేసి ఎల్కతుర్తి బహిరంగ సభకు తరలిరావాలని కోరారు. రాష్ట్రంలో ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో ప్రజలు అన్ని రకాలుగా విసిగిపోయారని, ప్రజలు మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని అన్నారు. సమావేశంలో పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వరరావు, మద్దెల రవి, దిశా కమిటీ సభ్యులు కట్టా కృష్ణార్జున్‌రావు, సీనియర్ నాయకులు మాదినేని ప్రసాద్, పారుపల్లి నాగం, కామినేని శ్రీనివాసరావు, అయినాల కనకరత్నం, గుజ్జర్లపూడి దేవరాజు, షేక్ సైదా, తోటకూర వీరబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సభతో కాంగ్రెస్ గుండెల్లో గుబులు పుట్టాలి

సన్నాహక సమావేశంలో జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

బోనకల్లులో మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజు

మధిర, ఏప్రిల్ 23 : ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరిగే రజతోత్సవ సభతో కాంగ్రెస్ గుండెల్లో గుబులు పుట్టాలని జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశం మధిర మండలం రాయపట్నం, బోనకల్లు మండలం రావినూతల గ్రామంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. రాబోయేది మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. సమావేశంలో మధిర మార్కెట్ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, బంధం శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ బానోత్ కొండ, బోనకల్లు మండల అధ్యక్షుడు చేబ్రోలు మల్లికార్జునరావు, వేమూరి ప్రసాద్, బెజవాడ మల్లికార్జునరావు, పారా ప్రసాద్, మోదుగుల నాగేశ్వరరావు, జెర్రిపోతుల రవీందర్, కొమ్మినేని ఉపేందర్, రైతు నాయకులు చావా వేణుబాబు, రాయపట్నం నాయకులు, మజీ సర్పంచ్ తిమోతి, గోపి, తదితరులు పాల్గొన్నారు.

మణుగూరులో బీఆర్ఎస్ ర్యాలీ

రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పిలుపు

మణుగూరులో ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

మణుగూరు టౌన్, ఏప్రిల్ 23 : ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మణుగూరులోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుంచి పూల మార్కెట్, బస్టాండ్, అంబేద్కర్ సెంటర్ మీదుగా బుధవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అగ్రభాగాన కార్యకర్తలు నృత్యాలు చేశారు. సభకు భారీగా శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కుర్రి నాగేశ్వరరావు, కో కన్వీనర్ కుంజా లక్ష్మణ్, సీనియర్ నాయకులు పట్టం రాంబాబు, తాళ్లపల్లి యాదగిరి గౌడ్, ఆవుల నరసింహారావు, జావీద్ బాషా, తురక రాంకోటి, మండల యువజన అధ్యక్షుడు బోశెట్టి రవిప్రసాద్, యువజన నాయకులు బానోత్ రమేశ్, సృజన్, మానుకోటి మహేశ్, ఆవుల శ్రీను, గాజుల కార్తీక్, ఓబీ నాయకులు మధు, మాదేవి అశోక్, వేమూరి రమేశ్, రాము, రమాదేవి, చంద్రకళ, స్వర్ణలత పాల్గొన్నారు.

'జారే'ను అడ్డుకున్నారే..

- చండ్రుగొండలో ఎమ్మెల్యే కాన్వాయ్ ఎదుట బైఠాయించిన రైతులు
- వారిని పక్కకు నెట్టివేసిన పోలీసులు, కాంగ్రెస్ నాయకులు
- నకిలీ విత్తనాలతో మోసపోయిన తమకు న్యాయం చేయాలని రైతుల డిమాండ్
- వాహనం దిగకుండా వెళ్లిపోయిన ఎమ్మెల్యే ఆదినారాయణ

చండ్రుగొండ ఠాణా ఎదుట నిరసన తెలుపుతున్న రైతులను అడ్డు తొలగిస్తున్న పోలీసులు, కాంగ్రెస్ నాయకులు

చండ్రుగొండ, ఏప్రిల్ 23 : నకిలీ మొక్కజొన్న విత్తన కంపెనీపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి నెలలు గడిచినా చర్యలు తీసుకోకపోవడంతో విసుగు చెందిన రైతులు(కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే) ఎమ్మెల్యే కాన్వాయ్‌ను అడ్డుకొని రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ ఘటన చండ్రుగొండ మండలంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. చండ్రుగొండ మండలం పోకలగూడెం పంచాయతీకి చెందిన 12 మంది గిరిజన రైతులు ఓ విత్తన కంపెనీకి చెందిన మొక్కజొన్నలను యాసంగి పంటగా వేశారు. అయితే దిగుబడి సరిగా రాకపోవడంతో గుర్తించిన రైతులు సదరు విత్తన కంపెనీపై ఫిబ్రవరి నెలలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆ కంపెనీపై చర్యలు తీసుకోకపోగా.. తమను పోలీస్‌స్టేషన్ చుట్టూ తిప్పించుకోవడంతో విసుగు చెందిన రైతులు బుధవారం మండల పర్యటనకు వచ్చిన అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కాన్వాయ్‌కు ఎదురుగా వెళ్లి జాతీయ రహదారిపై బైఠాయించి అడ్డుకున్నారు. దీంతో వెంటనే అప్రమత్తమైన పోలీసులు, కాంగ్రెస్ నాయకులు రైతులను పక్కకు నెట్టే ప్రయత్నం చేయగా వాగ్వాదం చోటు చేసుకుంది. ఎమ్మెల్యే కాన్వాయ్‌ను అడ్డుకోవడం సరికాదని కాంగ్రెస్ నాయకుడు కిరణ్‌రెడ్డి వారించడంతో అతడిపై రైతులు తిరగబడ్డారు. దీంతో అక్కడి నుంచి ఆయన ఉడాయించాడు. ఈ క్రమంలో పోలీసులు రైతులను బలవంతంగా పక్కకు నెట్టివేశారు. ఇంత జరుగుతున్నా ఎమ్మెల్యే కారు దిగకపోవడంపై రైతులు మండిపడ్డారు. నకిలీ విత్తనాలు అమ్మిన వ్యాపారులకు కాంగ్రెస్ నాయకులు, పోలీసులు వత్తాసు పలుకుతున్నారని రైతులు ఇస్లావత్ శంకర్, మూడ్ రమేశ్, భూక్య హరియా, సక్రు, నాగేష్, రమేశ్, సాయిరాం ఆరోపించారు. సొంత పార్టీకి చెందిన రైతులే ఎమ్మెల్యే కాన్వాయ్‌ను అడ్డుకోవడంపై పలు రకాలుగా చర్చించుకుంటున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల కోసం గ్రామస్తుల ధర్నా

60 మందికి.. 4 గృహాలు మంజూరు చేయడంపై నిరసన

మంజూరైన వాటిని కూడా రద్దు చేయాలని కమిటీ తీర్మానం

ఇందిరమ్మ ఇళ్ల కోసం అశ్వారావుపేట-రామన్నగూడెం ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా చేస్తున్న గ్రామస్తులు

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 23 : అర్హులైన ప్రతీ నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ అశ్వారావుపేట మండలం రామన్నగూడెం ఇందిరమ్మ గ్రామ కమిటీ సభ్యులు, గ్రామస్తులు అశ్వారావుపేట-రామన్నగూడెం ప్రధాన రహదారిపై బుధవారం ధర్నా నిర్వహించారు. గ్రామంలో 200 కుటుంబాలు ఉండగా.. 60 మందికి ఇళ్లు లేవు. ప్రభుత్వం కేవలం 4 ఇళ్లు మంజూరు చేయడాన్ని నిరసిస్తూ ఇందిరమ్మ కమిటీ ముందుగా గ్రామస్తులతో సమావేశం నిర్వహించింది. ఇందులో సంయుక్తంగా చర్చించి ఆ నాలుగు ఇళ్లు కూడా రద్దు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసి ఆమోదించినట్లు కమిటీ సభ్యులు కోర్స ప్రసాద్, రాచకొండ బంగారం, కె.ఉదయ్‌కుమార్, నారం కుమారి తెలిపారు. మొత్తం 60 మందికి ఇళ్లు మంజూరు చేయండి.. లేదంటే మా గ్రామానికి ఇళ్లే వద్దంటూ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో 20 మంది అర్హులు ఉన్నట్లుగా గుర్తించి.. 4 ఇళ్లు మంజూరు చేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ స్వరూప, ఆంజనేయులు, రవి, సీతారాముడు, రాజకుమారి, విజయ, సరోజిని, వెంకన్న, రామారావు, సురేశ్, దుర్గ, లక్ష్మి, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉగ్రదాడులను ఖండిస్తూ కొవొత్తుల ర్యాలీలు

ఖమ్మంలో సీపీఎం ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మల దహనం

ఖమ్మంలో కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న జేఏసీ నాయకులు

చిత్రాలు లోపలి పేజీల్లో..